## క్లుప్తంగా

### భక్తులకు అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

నగరి : మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు తిరుపతికి చెందిన పీకే శ్రీనివాసన్ అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

### బీమా సాయం అందజేత



బాధితులకు వైఎస్సార్ బీమా అందిస్తున్న కౌన్సిలర్లు

నగరి : పట్టణ పరిధిలోని పాతభజన గుడి వీధికి చెందిన మంగళవారం వైఎస్సార్ బీమా సాయాన్ని కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి అందజేశారు. బాషా భార్య ఎస్.ఖమర్ (48) ఇటీవల మృతి చెందారు. ఆమె వైఎస్సార్ బీమా మంజూరు కావడంతో మంగళవారం రూ.10 వేలు బాధిత కుటుంబానికి నగదు రూపంలో అందజేశారు. మిగిలిన మొత్తం రూ.90 వేలు వారి ఖాతాకు జమ అవుతుందని సచివాలయ అడ్మిన్ భాస్కర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, వలంటీర్ పాల్గొన్నారు.

### సమాజ గతిని తెలిపే దిక్సూచి సాహిత్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం: సాహిత్యం సమాజంలోని స్థితిగతులను తెలియజేసే ఓ దిక్సూచి అని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. మంగళవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోయి భీమన్న, తాపీ ధర్మారావు జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తాపీ ధర్మారావు హేతువాద దృక్పథం, బోయి భీమన్న అంబేద్కరిజం అందరికీ అనుసరణీయమని చెప్పారు. వారు ఇచ్చిన సందేశాలు ప్రజలకు, సమాజానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు మోహన్‌రావు, చంద్రబాబు వారి రచనల గురించి వివరించారు.

### మునస్వామికి నంది అవార్డు



జాతీయ బంగారు నంది అవార్డును అందుకుంటున్న మాజీ సర్పంచ్ మునస్వామి

కార్వేటినగరం: మండలంలోని డీఎంపురం పంచాయతీ సర్పంచ్‌గా 20 ఏళ్లపాటు విశేష సేవలు అందించిన మాజీ సర్పంచ్ మునస్వామిని జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సంస్థ ఉత్తమ సేవకుడిగా జాతీయ బంగారు నంది అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 2023 ఏడాదికి సంబంధించి ఉత్తమ సేవలు అందించిన విభాగంలో మునస్వామికి వల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు వీఆర్ శ్రీనివాస రాజుతో కలిసి మాజీమంత్రి వేణుగోపాల ఆచారి చేతులమీదుగా సోమవారం అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మునస్వామి మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను సర్పంచ్‌గా పంచాయతీకి 20 ఏళ్ల పాటు అందించిన విశిష్ట సేవలకు గానూ వల్లూరి ఫౌండేషన్ సంస్థ జాతీయ నంది అవార్డును అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

### జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నగరి : జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో నగరి మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఏ.శరణ్య, ఎండీ శ్యామ్ ప్రతిభ చాటారు. ఈనెల 16వ తేదీన ఓజోన్ పొరను కాపాడుకోవడం, వాతావరణాన్ని రక్షించుకోవడం అంశాలపై తిరుపతి సైన్స్ సెంటర్‌లో సింపోజియమ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పుదుపేట విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లాస్థాయిలో 3వ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, గైడ్ టీచర్ శశిరేఖను హెచ్‌ఎం టీవీ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.



శ్రీరంగరాజపురంలో గణనాథుని మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు



నగరి బస్టాండు ప్రాంగణంలో..



నింద్ర: ప్రసన్న వినాయకుడు



నగరి: కొబ్బరికాయలతో ..



నగరి చావడి ప్రాంతంలో..



వెదురుకుప్పం: పచ్చికాపల్లంలో

# దండాలయ్యా.. ఉండ్రాలయ్యా..

- వైభవంగా వినాయక చవితి వేడుకలు
- భారీగా కొలువుదీరిన గణనాథుని ప్రతిమలు
- ఆకట్టుకున్న కొబ్బరికాయల వినాయకుడు
- వినాయకుడికి మంత్రి రోజా పూజలు



విఘ్నేశ్వరుడికి పూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా



కార్వేటినగరం: శివాలయం వీధిలో



పుత్తూరు: ప్రత్యేక అలంకరణలో తరుణ గణపతి

నగరి : నియోజకవర్గ పరిధిలోని వినాయక చవితి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి పట్టణంలో పండుగ సందడి కనిపించింది. పలువురు మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలను ఇళ్లకు తీసుకెళ్లారు. ప్రధాన రహదారి మొత్తం పూజాసామగ్రి విక్రయాలు, కొనుగోలుదారులతో ప్రధాన రహదారి కిక్కిరిసింది. నగరి పరిధిలో అతి పెద్ద వినాయకుడి ప్రతిమలు ఏర్పాటు చేశారు. అలాగే నగరి మండలంలోని నంబాకం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వినాయకుని మట్టి ప్రతిమలకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. నగరి, జీడీనెల్లూరు నియోజకవర్గాల పరిధిలోని ప్రతి గ్రామంలో భారీ వినాయక ప్రతిమలు వెలిశాయి. విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో భక్తులకు గుగ్గిళ్లు, చక్కెర పొంగళి, పులిహోర, మిరియాల పొంగళి, స్వీట్లు ప్రసాదంగా పంచారు. మున్సిపల్ పరిధిలోని ఓంశక్తి ఆలయం సమీపంలో కొబ్బరికాయలతో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ భక్తు లను విశేషంగా ఆకర్షించింది. పట్టణ, మండల పరిధిలోని విఘ్నేశ్వర ఆలయాలు భక్తులతో కిక్కిరిశా యి. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

**నింద్రలో..**

నింద్ర: మండలవ్యాప్తంగా వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. నింద్రలో ప్రసన్న వినాయకుడి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**విఘ్నేశ్వరుడికి మంత్రి రోజా పూజలు..**

వినాయక చవితిని మంత్రి ఆర్‌కే రోజా వైభవంగా నిర్వహించారు. సోమవారం నివాసం ఆవరణలో ఉన్న వినాయకుడికి పూజలు నిర్వహించడంతో పాటు మట్టివినాయక ప్రతిమను సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా ఆమె పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి విఘ్నాలు కలుగకుండా వచ్చే వినాయక చవితికి రెండోసారి జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలోనే నడవాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

**కార్వేటినగరంలో..**

కార్వేటినగరం: వార్షిక వినాయక చవతి వేడుకలను పురస్కరించుకుని వాడవాడలా గణనాథుడి ఉత్సవాలను సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. కార్వేటినగరంలో గాండ్లమిట్ట కూడలిలో, శివాలయం వీధిలో సుమారు మూడు టన్నుల బరువు ఉన్న భారీ వినాయక ప్రతిమలను క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. గాండ్లమిట్ట కూడలిలో వినాయక విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి పూజలు చేశారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

**శ్రీరంగరాజపురంలో..**

శ్రీరంగరాజపురం: మండలంలోని వాడవాడలా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత పెద్దఎత్తున గణేశ్ ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు చేశారు.

**వెదురుకుప్పంలో..**

వెదురుకుప్పం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో చవితి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో యువత చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. చవటగుంటలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో చవితి వేడుకలు మిన్నంటాయి.

**పుత్తూరులో..**

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పుత్తూరు దళితవాడలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ఆధ్వర్యంలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కార్వేటినగరం రోడ్డులోని మండపం వద్ద, ఎన్జీఓ కాలనీలో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**పాలసముద్రంలో..**

పాలసముద్రం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో వినాయక చవతిని ఘనంగా జరుపుకున్నారు. గణనాథుడికి మహిళలు కుడుములు, సజ్జలు, చెరుకు గెడలు, యలక్కాయ, మొక్కజొన్న తదితర వాటిని సమర్పించారు.



పుత్తూరు దళితవాడలో కొలువుదీరిన గణేశుడికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి



నగరి: బస్టాండు ప్రాంగణంలో ప్రసాదాల పంపిణీ



నగరి : మండలంలోని తడుకుపేటలో..



నగరి: జనంతో కిక్కిరిసిన ప్రధాన రహదారి



వేలావడి ఎస్టీ కాలనీలో..



పాలసముద్రంలో..



పాలసముద్రం: బలిజకండ్రిగలో ..

## నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



సుదర్శన హోమం చేస్తున్న రుత్వికులు

నారాయణవనం: మండలంలో సింగిరికోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలను, హోమాలను నిర్వహించారు. నరసింహస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలమూర్తులకు అభిషేకాలను నిర్వహించారు. వెండి కవచాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. భక్తులకు వస్త్ర బహుమానం ఇవ్వడంతో పాటు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాల వితరణ చేశారు. ట్రస్టీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్య అన్నదానసత్రంలో అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు.



అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

## హోరాహోరీగా క్రీడాపోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న బాలుర జట్టు

పుత్తూరు రూరల్: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం పొందుతారని వడమాలపేట ఎంఈఓ పద్మావతమ్మ తెలిపారు. మంగళవారం వడమాలపేట జెడ్పీ హైస్కూల్‌లో అండర్-14, అండర్-17 బాల బాలికలకు నగరి నియోజకవర్గస్థాయి వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓలు పద్మావతమ్మ, తులసీరామ్, పాఠశాల ఇన్‌చార్జ్ ఉపాధ్యాయుడు హేమాద్రి ప్రారంభించారు. నగరి, నింద్ర, విజయపురం, పుత్తూరు, వడమాలపేట మండలాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం కరుణనవనీతం తెలిపారు. పోటీల్లో విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్‌బాబు, కోఆర్డినేటర్లు నందకుమార్, చంద్రశేఖర్‌రాజు, గురప్ప, మధుబాబు, సుబ్రమణ్యం, సత్య, శ్రీధర్, వహిదాబేగం, మణి, గోపి పోటీలను పర్యవేక్షించారు.

### మద్యం అక్రమ విక్రేత అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

వెదురుకుప్పం: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న విక్రేతను వెదురుకుప్పం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ రమేష్ బాబు కథనం మేరకు.. మండలంలోని బలిజపల్లెకు చెందిన సోకయ్య కుమారుడు కె.ధనశేఖర్ గ్రామంలోని చిల్లర దుకాణంలో మద్యం విక్రయిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పోలీసులు గ్రామంలోకి రాగా, వారిని చూసి ధనశేఖర్ పారిపోయాడు. దుకాణాన్ని పోలీసులు తనిఖీ చేయగా 40 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. మంగళవారం నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి, పుత్తూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు.

### గంజాయి తరలింపుపై ప్రత్యేక నిఘా



ఓజీకుప్పంలో నిఘాలో ఉన్న పోలీసులు

నగరి : నగరి మండలం తమిళనాడు సరిహద్దులోని ఓజీ కుప్పం గ్రామ పరిసరాల్లో గంజాయి అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ గ్రామం తమిళనాడు సరిహద్దును ఆనుకుని ఉంది. తమిళనాడుకు చెందిన కొందరు గంజాయి విక్రయదారులు ఈ ప్రాంతంలో తచ్చాడుతున్నట్లు, స్థానికులతో గొడవలకు దిగుతున్నట్లు జిల్లా అధికారులు, సీఐ సురేష్ దృష్టికి వచ్చింది. దీంతో ఓజీకుప్పం గ్రామ పరిసరాల్లో ఆదివారం నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో పోలీసు గస్తీ ఉంచారు. గ్రామానికి కొత్తగా వచ్చే వ్యక్తులను, వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి విక్రయదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నా రు. ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్సీ వర్గీకరణ చేయాలని దీక్ష



పుత్తూరులో ఎమ్మార్పీఎస్ దీక్షలు

పుత్తూరు రూరల్: ప్రస్తుతం పార్లమెంటులో జరుగుతున్న ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నగరి నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జ్ శివయ్యమాదిగ మాట్లాడుతూ గత 29 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ పోరాటం చేస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ రెండవ దఫా అధికారంలోకి వచ్చినా నేటికీ హామీ నెరవేరలేదని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అయినా వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మునువేలు, నగరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ క్రిష్, పుత్తూరు మండల అధ్యక్షుడు వెంకటేష్, వడమాలపేట అధ్యక్షుడు మధు, నాయకులు గురవయ్య, తులసీరామ్, ధనుంజయ్, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ మణికృష్ణ

పాలసముద్రం : గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని నుంచే బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కోఆర్డినేటర్ కన్నన్ తెలిపారు. మంగళవారం పాలసముద్రంలో మండల ఆ పార్టీ అధ్యక్షుడు పుష్పరాజ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ నారాయణస్వామి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ అడ్వొకేట్ మణికృష్ణ మాట్లాడుతూ ఈ దేశానికి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, చంద్రబాబు, గోవర్ధన రెడ్డి, సుబ్బరాయులు, దినకరన్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కార్వేటినగరం: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, వ్యాధులను గుర్తించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని సీహెచ్‌ఓ పవిత్ర అన్నారు. మంగళవారం మండల పరిధిలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ముందుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సుమారు 150 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవులు, పీడీ తిరుమలరాజు, వైద్యసిబ్బంది పలువురు పాల్గొన్నారు.